# నినాదం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం 17 ఫిబ్రవరి 2025 | తెలంగాణ ప్రాంతీయం | పేజీలు 8


## సేవాలాల్ మహారాజ్ మార్గం
## నేటి సమాజానికి ఆదర్శనీయం



2

## కృష్ణా జలాలను ఏపీ తరలించుకుపోతుంటే..
# ఏం చేస్తున్నారు..
### సీఎం రేవంత్ రెడ్డిని నిలదీసిన హరీశ్‌రావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 16(నినాదం న్యూస్):** తెలంగాణ నీటి ప్రయోజనాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గండి కొడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుండటం దుర్మార్గమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు విమర్శించారు. కృష్ణా జలాలను ఏపీ అడ్డూ అదుపూ లేకుండా తరలించుకుపోతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి రోజుకు 10వేల క్యూసెక్కులను ఏపీ తరలించుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని నిలదీశారు. ఈ వాటర్ ఇయర్ లోనే 646 టీఎంసీలు తరలిస్తే ఎందుకు నోరు మెదపడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాంగ్రెస్ కు పట్టవా అని నిలదీశారు. సాగర్ ఆనకట్ట కేంద్ర బలగాల ఆధీనంలో ఉందని.. వారి పర్యవేక్షణలో మాత్రమే నీటిని విడుదల చేసుకోవాల్సి ఉన్నప్పటికీ ఏపీ మాత్రం ఇష్టారాజ్యంగా నీటిని తరలిస్తున్నదని విమర్శించారు. తెలంగాణ తాగునీటి అవసరాలకు శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నిలువ ఉంచాల్సిన కోటాను ఏపీ తీసుకెళుతుంటే రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేదని మండిపడ్డారు. శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో మిగులు నిల్వలు లేకున్నా పోతిరెడ్డిపాడు, సాగర్ కుడి కాల్వ ద్వారా ఇప్పటికే ఏపీ నీటిని తరలిస్తూ మొండిగా వ్యవహరిస్తుందని హరీశ్‌రావు విమర్శించారు. ప్రతి సంవత్సరం ఉమ్మడి ప్రాజెక్టులకు సంబంధించి నీటి వినియోగానికి మిగతా2లో




## సివిల్ సర్వీస్ అధికారులు సానుకూల దృక్పథం
# కలిగి ఉండాలి
### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 16(నినాదం న్యూస్):** సమస్యలను పరిష్కరించడంలో సివిల్ సర్వీస్ అధికారులు ప్రజలకు ఉపయోగపడే విధంగా సానుకూల దృక్పథం కలిగి ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. పేదలకు సహాయం చేయాలన్న ఆలోచన ఉన్న అధికారులు ప్రజల మనసుల్లో ఎక్కువ కాలం గుర్తుంటారని చెప్పారు. ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎం. గోపాలకృష్ణ గారు రాసిన 'లైఫ్ ఆఫ్ ఏ కర్మ యోగి' పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... "గతంలో ఐఏఎస్ అధికారులు నిత్యం ప్రజల్లో ఉండేవారు. ఆ కారణంగానే రాజకీయ నాయకుల కంటే అధికారులనే ప్రజలు ఎక్కువగా గుర్తుంచుకునే వారు. ముఖ్యంగా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించడం వల్ల సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. కానీ  కొందరు కలెక్టర్లు ఏసీ రూములను వదిలి బయటకు వెళ్లడం లేదు. కలెక్టర్లు, ఎస్పీలకు జిల్లా స్థాయిలో గడించే అనుభవమే కీలకమవుతుంది. అధికారుల్లో మార్పు రావలసిన అవసరం ఉంది. నిబద్ధత కలిగిన అధికారులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుంది. రాజకీయ నాయకులు నిర్ణయాలు చేసినప్పుడు వాటిలోని అంశాలను విశ్లేషించి వివరించాల్సిన బాధ్యత సివిల్ సర్వీసెస్ అధికారులదే. బిజినెస్ రూల్స్ వివరించాలి. కొందరు వాటిని విస్మరిస్తున్నారు. అది సమాజానికి మంచిది కాదు. అధికారుల ఆలోచనా విధానాల్లో మార్పు రావాలి. ఎంతో నిబద్ధతతో పనిచేసిన గొప్ప అధికారి శంకరన్ గారు, పారదర్శక ఎన్నికల నిర్వహణకు ఎంతో కృషి చేసిన గొప్ప వ్యక్తి శేషన్ గారు, దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపిన వ్యక్తి మన్మోహన్ సింగ్ లాంటి వారి అనుభవాల నుంచి కొత్తగా సర్వీసులో చేరుతున్న సివిల్ సర్వెంట్స్ ఎంతో నేర్చుకోవాల్సి ఉంది. ఆరు దశాబ్దాల అనుభవాన్ని ఈ పుస్తకంలో నిక్షిప్తం చేశారు. మనం ఏదైనా కొనొచ్చు. కానీ అనుభవాన్ని కొనలేం. సివిల్ సర్వెంట్స్ అందరికీ గోపాలకృష్ణ గారి పుస్తకం వెలకట్టలేనిది. అందరికీ ఒక దిక్సూచిగా ఉంటుంది.  తొలి ప్రధానమంత్రి నెహ్రూ గారి కాలం నుంచి నేటి ప్రధాని మోదీ గారి వరకు అనుభవం కలిగిన గోపాలకృష్ణ గారు.. క్లోజ్డ్ ఎకానమీ నుంచి ఓపెన్ ఎకానమీ వరకు దేశంలో మార్పులకు ప్రత్యక్ష సాక్షి. భవిష్యత్తును కూడా వారు విజువలైజ్ చేయగలుగుతున్నారు" అని వివరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, అసోసియేషన్ వైస్-ప్రెసిడెంట్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావుతో పాటు పలువురు ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఐపీఎల్ 2025 షెడ్యూల్ వచ్చేసింది..
### 65 రోజుల్లో 74 మ్యాచ్‌లు..

**హైదరాబాద్, ఫిబ్రవరి 16(నినాదం న్యూస్):** ఐపీఎల్ 2025 హంగామా మొదలైంది. క్రికెట్ అభిమానులు ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ ఎడిషన్ షెడ్యూల్ వచ్చేసింది. మార్చి 22న ఈ సీజన్ మొదలు కానుంది. 65 రోజుల పాటు కొనసాగునున్న ఈ సీజన్‌లో మొత్తం మిగతా2లో





## కృష్ణా జలాలను ఏపీ తరలించుకుపోతుంటే.. ఏం చేస్తున్నారు..

**(మొదటిపేజీ తరువాయి..)**

కేఆర్ఎంబీ పరిధిలోని త్రిమెన్ కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. కానీ ఈ ఏడాది ఇంతవరకు త్రిమెన్ కమిటీ మీటింగ్ పెట్టలేదని.. అంటే బోర్డు వ్యవహారం ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. బోర్డు పై ఒత్తిడి చేయడంలో, నీటి తరలింపు చేయకుండా ఏపీని నిలువరించడంలో తద్వారా తెలంగాణ నీటి హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ సర్కారు ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఏపీ దూకుడు, తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్య వల్ల ఇప్పటికే నాగార్జున సాగర్, శ్రీశైలం రిజర్వాయర్లు ఖాళీ అయిన పరిస్థితి నెలకొందని హరీశ్‌రావు అన్నారు. మరోవైపు వేసవి పూర్తిగా మొదలు కాలేదు తెలంగాణ రైతులు నీళ్ళ కోసం రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారని హరీశ్‌రావు అన్నారు. ఏపీ నీటి తరలింపును ఇప్పటికైనా అడ్డుకోకపోతే సాగర్ ఆయకట్టుకు ప్రమాదం ఏర్పడనుందని తెలిపారు. సాగర్ లో నీటిమట్టం పడిపోతే హైదరాబాద్ నగరానికి తాగునీటి సమస్య సైతం ఏర్పడుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి ఏపీ నీటి దోపిడిని అడ్డుకోవాలని, ఈమేరకు కృష్ణ బోర్డుపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

## ఐపీఎల్ 2025 షెడ్యూల్ వచ్చేసింది..



**(మొదటిపేజీ తరువాయి..)**

74 మ్యాచ్‌లు జరగనున్నాయి. లీగ్ దశ మే 18వ తేదీతో ముగుస్తుంది. ప్లే ఆఫ్స్ మే 20 నుంచి 25 వరకు జరగుతాయి. మే 25వ తేదీన కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో ఫైనల్ మ్యాచ్ జరగనుంది. క్వాలిఫైయర్ 2 మ్యాచ్‌కు కూడా ఇదే వేదిక ఆథిత్యం ఇవ్వనున్నది. ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్, ఇంతవరకూ ట్రోఫీ గెలవని జట్టు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరగనుంది. తొలి మ్యాచ్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరగనుంది. గత ఏడాది రన్నరప్‌గా నిలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ మార్చి 23వ తేదీనతన సొంత మైదానం ( ఉప్పల్ స్టేడియం)లోనే రాజస్థాన్‌తో తలపడనుంది.

**కొత్త వేదికల్లో మ్యాచులు..**

ఐపీఎల్-2025 సీజన్‌లో గతంలో మాదిరిగానే 10 వేదికల్లో మ్యాచులు జరుగుతాయి. అలాగే, ఈ సారి ఐపీఎల్ మ్యాచులకు ఈ సారి కొత్త వేదికల్లోనూ పలు మ్యాచులు నిర్వహించనున్నారు. ఈ సారి మ్యాచులు అహ్మదాబాద్, ముంబయి, చెన్నై, బెంగళూరు, లక్నో, ముల్లన్‌పూర్, ఢిల్లీ, జైపూర్, కోల్‌కతా, హైదరాబాద్, గువాహటి, ధర్మశాలలో జరుగుతాయి. రాజస్థాన్ రాయల్స్ గువాహటిని రెండో హోంగ్రౌండ్‌గా ఎంపిక చేసుకుంది. మార్చి 26, 30 తేదీల్లో ఇక్కడ రెండు మ్యాచులు జరుగనున్నాయి. రాజస్థాన్ జట్టు కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచులు ఆడుతుంది. పంజాబ్ కింగ్స్ తన మూడు హోం మ్యాచ్‌లను ధర్మశాలలో ఆడనుండగా.. మిగిలిన హోం మ్యాచ్‌లు పంజాబ్‌లోని ముల్లాన్‌పూర్‌లో ఆడనున్నాయి.


# సేవాలాల్ మహారాజ్ మార్గం నేటి సమాజానికి ఆదర్శనీయం

- **డిసిసిబి డైరెక్టర్ మాజీ జెడ్పీటిసి మేకల మల్లిబాబు యాదవ్**



**ఖమ్మం, ఫిబ్రవరి16( నినాదం న్యూస్):** సేవాలాల్ మహారాజ్ మార్గం నేటి సమాజానికి ఆదర్శంగా ఉండాలని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో లంబాడా హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు భూక్య నాగేంద్రబాబు నాయక్,యువజన నాయకుడు బాదవత్ నాగరాజు నాయక్ అధ్యక్షతన సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మేకల మల్లి బాబు యాదవ్ పాల్గొని సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసిఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ లంబాడగిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జీవితం నేటి సమాజానికి ఆదర్శమని, ఆయన అనుసరించిన విధానాలు మానవ జీవితానికి ఆరోగ్యానికి ఎంతో ప్రధానమని, మూడ విశ్వాసాలను నమ్మకూడదని, అహింసే పరమధర్మమని, తన ధర్మం ద్వారా, తన నిష్ఠతో భక్తితో, దేవతను మెప్పించగలిగాడని, అలాంటి మహా వ్యక్తి యొక్క జీవితం మనందరికీ గొప్ప ఆదర్శమని పేర్కొన్నారు. ముఖ్యంగా బంజారాలకు చేసినటువంటి ఎన్నో కార్యక్రమాలు వారు చూపించినటువంటి ధర్మ మార్గం బంజారా ప్రజలు సేవలాల్ మహారాజ్ అనుసరించినటువంటి నీతి నియమాలు కట్టుబడి ఉండేవారని చెప్పడం జరిగింది బంజారా ప్రజలు పాటించవలసినటువంటి ఆహార నియమ నిబంధనలు మద్యం మాంసం కు దూరంగా ఉండాలని చెప్పడం జరిగింది గోర్ బంజారా జాతి ఏక్ వాత్ ఏక్ జాత్ అనే మాటను వజ్రాయుధంగా భావించి గోర్ బంజారా ప్రజలందరూ పాటించాలని సేవాలాల్ మహారాజ్ ఎల్లప్పుడూ తాపత్రయపడేవారు పండ్లను పాలను ఆహారంగా భుజించేటటువంటి సేవాలాల్ మహారాజ్ ప్రజలకు తాను మార్గదర్శిగా ఉన్న ఎన్నో సంఘటనలను మేకల మల్లిబాబు యాదవ్ చెప్పడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు బానోత్ నరసింహనాయక్ తండా నాయకులు ధరావత్ లాకు, బానోతు బాసు భీముడు నాయక్ బాదవత్ హాట్య నాయక్ గుగులోత్ రుబ్బ్య నాయక్ ఉపాధ్యాయులు బోడా నాగు ,ముత్తయ్య సీతారాములు శాంతి ఉపేందర్ జగపతిబాబు , గూగులోత్ భవసింగ్, బాణోత్ మున్న, శ్రీను,నాగరాజు, భూక్యా చాంప్ల, బానోత్ రామా లక్ష్మి భూక్యా వీరన్న, నందా, శివాజి, రాము రమేష్ రవి,సురేష్,రఘు ,అంజలి,విజయ,అరుణ, లక్ష్మీ, నీల తదితరులు పాల్గొన్నారు.

# పెద్దగట్టు జాతర.. ఎన్‌హెచ్ 65పై వాహనాల మళ్లింపు



**సూర్యాపేట, ఫిబ్రవరి 16 (నినాదం న్యూస్):** రాష్ట్రంలోనే రెండో అతి పెద్దదైన పెద్ద గట్టు(గొల్లగట్టు) లింగమంతుల స్వామి జాతరకు వేళయ్యింది. సూర్యాపేట జిల్లా కేంద్రానికి 6 కిలోమీటర్ల దూరంలో దురాజ్‌పల్లిలోని పెద్దగట్టు యాదవుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా పేరొందింది. రెండేండ్లకోసారి జరిగే ఈ జాతర ఆదివారం అర్ధరాత్రి గంపల ప్రదక్షిణలతో ప్రారంభం కానుంది. ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాలకు సుమారు 20నుంచి 25లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు బందోబస్తుతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నారు. జాతీయ రహదారి 65పై కూడా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. వాహనాలను దారి మళ్లించనున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ ఆంక్షలు ఆదివారం తెల్లవారుజాము నుంచే అమల్లోకి వస్తాయన్నారు.

**నార్కట్‌పల్లి వద్ద**

హైదరాబాద్ నుండి విజయవాడ వైపు వెళ్ళు వాహనాలను నార్కట్ పల్లి వద్ద మళ్లించి నల్గొండ వైపుగా మిర్యాలగూడ, హుజూర్ నగర్, కోదాడ మీదుగా విజయవాడకు మళ్లించనున్నారు.

**కోదాడ వద్ద**

విజయవాడ నుండి హైదరాబాద్ వెళ్ళే వాహనాలను కోదాడ వద్ద మళ్లించి హుజూర్ నగర్, నేరేడుచర్ల, మిర్యాలగూడ, నల్గొండ, నార్కట్‌పల్లి మీదుగా హైదరాబాద్ మళ్ళించనున్నారు.

# కాంగ్రెస్ తెలంగాణకు పట్టిన ఒక శని..

- **రేవంత్ సర్కార్‌పై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజం**



**హైదరాబాద్, ఫిబ్రవరి 16(నినాదం న్యూస్):** కాంగ్రెస్ ఈ తెలంగాణ రాష్ట్రానికి పట్టిన ఒక శని అని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. ఒకప్పుడు గురుకులాల్లో చదవడానికి లక్షల మంది పిల్లలు పోటీపడేవారని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి అడ్మిషన్ల కోసం సెక్రటరీ ఆఫీసు ముందు అర్ధరాత్రి వరకు పడిగాపులు కాసే వారని గుర్తుచేశారు. తమ పిల్లల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దడం కోసం, ప్రైవేట్ సంస్థలకు లక్షలాది రూపాయలు ఖర్చుచేయకుండా నాణ్యమైన విద్య పొందేవారని పేర్కొన్నారు. గత పది సంవత్సరాలలో విద్యార్థులు మంచి పౌష్టికాహారం తీసుకుంటూ అద్భుతమైన ఫలితాలు సాధించేవారని చెప్పారు. కానీ ఇప్పుడు గురుకులాల్లో ప్రతిరోజూ ఏదో ఒక సమస్య కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫుడ్ పాయిజన్ కేసులు, విద్యార్థి ఆత్మహత్యలు, పాము కాటు సంఘటనలు, ఎలుకల బెడద.. ఫలితంగా చివరి తేదిని ఎన్ని సార్లు పొడిగించినా ఐదో తరగతి దరఖాస్తులు 80 వేలు కూడా దాటలేదని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. ఇవన్నీ కేవలం ఒక ఏడాదిలోనే జరగడం గమనార్హమని పేర్కొన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో విద్యార్థుల జీవితాలు ఆగమైనయని.. భవిష్యత్తుకు భరోసా లేదని.. ఏం తినాలన్నా, ఏ అనారోగ్యం పాలవుతారోనని ఆందోళన నెలకొందని మండిపడ్డారు. ఏ సమయంలో ఏ సంఘటన జరిగి ఆత్మహత్య చేసుకుంటారోననే భయం, పిల్లలు తల్లితండ్రులలో నెలకొందని అన్నారు. ఈ దుస్థితిపై అడిగితే కేసులు పెడుతున్నారని భయం ఉందన్నారు. ఇదంతా కేవలం నిర్లక్ష్యం, వివక్ష, అనాలోచిత విధానాల వల్ల జరుగుతున్నవేనని పేర్కొన్నారు.

రాష్ట్రంలోని గురుకులాల్లో ఇంత జరిగినా కాంగ్రెస్ కు పట్టింపులేదని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. విద్యాశాఖ మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్క సమీక్ష కూడా చేయలేదని.. చేసినా అది కేవలం ఫోటోల కోసమే అని అన్నారు. కేసీఆర్ అద్భుతంగా అభివృద్ధి చేసిన గురుకులాలను, ఆగం చేయాలనే కోరిక, పేదలకు నాణ్యమైన విద్యను దూరం చేయాలనే దుర్మార్గపు ఆలోచన నిజం అవుతున్నదనే సంతోషం వారిలో ఉండవచ్చని మండిపడ్డారు. కానీ ఈ పేద ప్రజలు మిమ్మల్ని విడిచిపెట్టరని.. మీరు చేస్తున్న ఈ దారుణాలను మరిచిపోరని హెచ్చరించారు. పేదల వ్యతిరేక పాలన అంతమయ్యేవరకు కేసీఆర్ నాయకత్వంలో పోరాడుతామని.. తెలంగాణను కాపాడుకుంటామని స్పష్టం చేశారు.

# రోజూ 2 టేబుల్ స్పూన్ల అవిసె గింజలను తినండి చాలు..

**చేపలను తినకున్నా ఫర్వాలేదు..!**

పూర్వకాలంలో మన పెద్దలు అనేక రకాల ఆహారాలను తినేవారు. వాటిల్లో అవిసె గింజలు కూడా ఒకటి. ఇవి శరీరానికి ఎంతో బలాన్నిస్తాయి. మన పెద్దలు ఎక్కువగా శారీరక శ్రమ చేసేవారు. కనుక వారికి ఈ గింజలు అమితమైన బలాన్ని ఇచ్చేవి. పైగా ఈ గింజలను తింటే పోషకాలు కూడా లభిస్తాయి. దీంతో ఆరోగ్యంగా ఉంటారు. రోగాలు రాకుండా కాపాడుకోవచ్చు. కానీ నేటి తరుణంలో మనం ఈ గింజలను తినడమే మానేశాం. వాస్తవానికి అవిసె గింజలు మనకు లభించిన అమృత ప్రసాదం అని చెప్పవచ్చు. ఎందుకంటే ఎన్నో పోషకాలు ఈ గింజల్లో ఉంటాయి. అవిసె గింజలను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు. వీటిల్లో మన శరీరానికి కావల్సిన ఎన్నో పోషకాలు ఉంటాయి. రోజూ 1 లేదా 2 టేబుల్ స్పూన్ల మేర అవిసె గింజలను తింటున్నా అనేక ప్రయోజనాలను పొందవచ్చు.



**హార్ట్ ఎటాక్ రాకుండా..**

1 టేబుల్ స్పూన్ లేదా 15 గ్రాముల అవిసె గింజలను తింటే సుమారుగా 76 క్యాలరీల శక్తి లభిస్తుంది. 4 గ్రాముల ప్రోటీన్లు, 6 గ్రాముల ఆరోగ్యకరమైన కొవ్వులు, 9 గ్రాముల పిండి పదార్థాలు, 3.3 గ్రాముల ఫైబర్, 0.2 మిల్లీగ్రాముల విటమిన్ బి1, 0.2 మిల్లీగ్రాముల కాపర్, 57 మిల్లీగ్రాముల మెగ్నిషయం, 1.1 మిల్లీగ్రాముల ఐరన్ లభిస్తాయి. అందువల్ల అవిసె గింజలను పోషకాలకు నెలవుగా చెప్పవచ్చు. ఈ గింజల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. దీని వల్ల రక్త నాళాలు వాపులకు గురికాకుండా చూసుకోవచ్చు. రక్త నాళాల్లో ఉండే కొవ్వు కరిగిపోతుంది. రక్త నాళాల్లో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీంతో హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు.

**బీపీ కంట్రోల్‌లో..**

అవిసె గింజలను తినడం వల్ల రక్తనాళాలు క్లియర్ అయి బీపీ నియంత్రించబడుతుంది. అందువల్ల హైబీపీ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. రోజూ 2 టేబుల్ స్పూన్ల అవిసె గింజలను తింటుంటే బీపీ కంట్రోల్ అవుతుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారు ఈ గింజలను తింటుంటే రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలోకి వస్తాయి. దీంతో డయాబెటిస్ అదుపులో ఉంటుంది. అవిసె గింజల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు యాంటీ క్యాన్సర్ కారకాలుగా పనిచేస్తాయి. దీంతో క్యాన్సర్ కణాల పెరుగుదలను అడ్డుకోవచ్చు.

**మెదడు యాక్టివ్‌గా..**

అవిసె గింజల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు మెదడును ఆరోగ్యంగా ఉంచుతాయి. మెదడు చురుగ్గా యాక్టివ్‌గా ఉండేలా చేస్తాయి. దీని వల్ల వృద్ధాప్యంలో వచ్చే మతిమరుపు సమస్యకు చెక్ పెట్టవచ్చు. చేపలను తినలేని వారికి అవిసె గింజలు ఉత్తమమైన ఆహారం అని చెప్పవచ్చు. చేపల్లో ఉండే పోషకాలన్నీ దాదాపుగా ఈ గింజల్లోనూ ఉంటాయి. కనుక చేపలను తినడం లేదని బాధపడేవారు వాటిల్లోని పోషకాలు అందాలంటే అవిసె గింజలను తింటుంటే చాలు, అనేక పోషకాలను పొందవచ్చు. ఈ గింజల్లో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు శరీరంలోని కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. దీంతో ఎల్‌డీఎల్ తగ్గి హెచ్‌డీఎల్ పెరుగుతుంది. ఫలితంగా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఇలా అవిసె గింజలను తినడం వల్ల అనేక అద్భుతమైన లాభాలను పొందవచ్చు.

## ఫిష్ ఆయిల్ క్యాప్సూల్స్ వాడితే..
# ఇన్ని ప్రయోజనాలు ఉన్నాయా..?

మన శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే అనేక రకాల పోషకాలు అవసరం అన్న సంగతి అందరికీ తెలిసిందే. అనేక విటమిన్లు, మినరల్స్ మనకు అవసరం అవుతుంటాయి. అలాగే మన శరీరానికి కావల్సిన పోషకాల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు కూడా ఒకటి. ఇవి అనేక జీవక్రియల నిర్వహణకు అవసరం అవుతాయి. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు మనకు ఎక్కువగా విత్తనాలు, గింజల్లో, అవకాడో వంటి పండ్లలో లభిస్తాయి. అలాగే చేపల్లోనూ ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. అయితే చేపలను తినలేని వారి కోసం ఫిష్ ఆయిల్ క్యాప్సూల్స్ కూడా అందుబాటులో ఉంటాయి. ఈ క్యాప్సూల్స్‌లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. డాక్టర్ సలహా మేరకు ఈ క్యాప్సూల్స్‌ను వాడుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ క్యాప్సూల్స్‌లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు మాత్రమే కాకుండా ఇంకా ఇతర పోషకాలు కూడా అనేకం ఉంటాయి. ఈ క్రమంలో ఫిష్ ఆయిల్ క్యాప్సూల్స్ వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.



**గుండె పోటు రాదు..**

ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు మన గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి గుండె పోటు రాకుండా చూస్తాయి. అలాగే ఫిష్ ఆయిల్ క్యాప్సూల్స్ లో ఈపీఏ, డీహెచ్ఏ అనే సమ్మేళనాలు కూడా ఉంటాయి. ఇవి వాపులను తగ్గిస్తాయి. గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. దీంతో గుండె పోటు రాకుండా అడ్డుకోవచ్చు. అలాగే వయస్సు మీద పడడం వల్ల వచ్చే అల్జీమర్స్ రాకుండా చూడవచ్చు. ఫిష్ ఆయిల్ క్యాప్సూల్స్‌లో విటమిన్ డి సైతం ఉంటుంది. ఇది ఎముకలు, దంతాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. మనం తిన్న ఆహారాల్లో ఉండే క్యాల్షియంను శరీరం శోషించుకునేలా చేస్తుంది. దీంతో ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది. ఆస్టియోపోరోసిస్, డయాబెటిస్ రాకుండా చూసుకోవచ్చు.

**విటమిన్ ఎ అధికం..**

ఫిష్ ఆయిల్ క్యాప్సూల్స్‌లో విటమిన్ ఎ కూడా అధిక మొత్తంలో ఉంటుంది. ఇది కంటి చూపును మెరుగు పరుస్తుంది. కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. చర్మం ఆరోగ్యంగా మారి కాంతివంతంగా ఉంటుంఇ. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. విటమిన్ ఎ యాంటీ ఆక్సిడెంట్‌గా కూడా పనిచేస్తుంది. దీని వల్ల కణాలు డ్యామేజ్ అవకుండా సురక్షితంగా ఉంటాయి. ఫిష్ ఆయిల్ క్యాప్సూల్స్‌లో సెలీనియం కూడా ఎక్కువగానే ఉంటుంది. సెలీనియం యాంటీ ఆక్సిడెంట్‌లా కూడా పనిచేస్తుంది. ఇది కణాలు డ్యామేజ్ అవకుండా రక్షిస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా ఉంచుతుంది. పలు రకాల క్యాన్సర్లు రాకుండా అడ్డుకుంటుంది. క్యాన్సర్ కణాలను నాశనం చేస్తుంది.

**థైరాయిడ్ పనితీరుకు..**

ఫిష్ ఆయిల్ క్యాప్సూల్స్‌లో అయోడిన్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది థైరాయిడ్ పనితీరును మెరుగు పరుస్తుంది. మెటబాలిజం పెరిగేలా చేస్తుంది. గర్భిణీలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పొట్టలోని శిశువు ఎదుగుదలకు సహాయ పడుతుంది. ఫిష్ ఆయిల్ క్యాప్సూల్స్‌లో కోలిన్ కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇది మెదడును ఆరోగ్యంగా ఉంచుతుంది. మెదడు పనితీరును మెరుగు పరుస్తుంది. దీంతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి. వృద్ధాప్యంలో మతిమరుపు రాకుండా చూసుకోవచ్చు. ఫిష్ క్యాప్సూల్స్ లో ఆస్టాజాంతిన్ అనే సమ్మేళనం కూడా ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేస్తుంది. వాపులను తగ్గిస్తుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాకుండా అడ్డుకుంటుంది. ఇలా ఫిష్ ఆయిల్ క్యాప్సూల్స్‌ను తీసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. అయితే డాక్టర్ సలహా మేరకు వీటిని వాడుకోవాల్సి ఉంటుంది.

# రోజూ ఉదయం క్యారెట్ జ్యూస్‌ను తాగాల్సిందే..



మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉండే కూరగాయల్లో క్యారెట్లు కూడా ఒకటి. క్యారెట్లను చాలా మంది పచ్చిగా తినేందుకే ఆసక్తిని చూపిస్తుంటారు. క్యారెట్లను కూరల్లోనూ వేస్తుంటారు. చారు వంటి వాటిల్లో క్యారెట్ల వాడకం ఎక్కువగా ఉంటుంది. అయితే క్యారెట్లను తినలేని వారు వీటిని జ్యూస్‌లా చేసి కూడా తీసుకోవచ్చు. రోజూ ఉదయాన్నే క్యారెట్ జ్యూస్ తాగితే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. క్యారెట్లలో మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాలు ఉంటాయి. క్యారెట్లతో జ్యూస్ చేసి రోజూ ఉదయాన్నే తాగితే పలు వ్యాధులను నయం చేసుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. క్యారెట్లు మన శరీరానికి శక్తిని అందిస్తాయి. వ్యాధుల నుంచి బయట పడేస్తాయి.

**రోగ నిరోధక వ్యవస్థకు..**


క్యారెట్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీంతో మన శరీరం ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. దీని వల్ల శరీరం ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉంటుంది. ఉదయం క్యారెట్ జ్యూస్‌ను తాగడం వల్ల రోజంతా చురుగ్గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. బద్దకం పోయి యాక్టివ్‌నెస్ పెరుగుతుంది. క్యారెట్ జ్యూస్‌లో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. దీంతో కడుపు ఉబ్బరం తగ్గుతుంది. క్యారెట్ జ్యూస్‌ను తాగడం వల్ల లివర్ ఆరోగ్యం మెరుగు పడుతుంది. లివర్‌లో ఉండే వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు పోతాయి. శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. వ్యాధులు నయం అవుతాయి. రోజంతా మీకు తాజాదనపు అనుభూతి కలుగుతుంది.

**కంటి చూపు పెరిగేందుకు..**

క్యారెట్లలో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది మన శరరీంలో విటమిన్ ఎగా మారుతుంది. ఇది కంటి చూపును మెరుగు పరుస్తుంది. కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. వయస్సు మీద పడడం వల్ల కళ్లలో వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకోవచ్చు. క్యారెట్లలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి అధికంగా ఉంటాయి. ఇవి కొల్లాజెన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. దీంతో చర్మం మృదువుగా మారి కాంతివంతంగా కనిపిస్తుంది. చర్మం డ్యామేజ్ అవకుండా ఉంటుంది. మొటిమలు తగ్గుతాయి. చర్మం సహజసిద్ధమైన నిగారింపును సొంతం చేసుకుని మెరుస్తుంది. దీంతో ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపిస్తారు.

**బరువు తగ్గడానికి..**

క్యారెట్లలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. పోషకాలు అధికంగా ఉంటాయి. అందువల్ల అధిక బరువు తగ్గాలనుకునే వారు రోజూ క్యారెట్ జ్యూస్‌ను తాగితే ఫలితం ఉంటుంది. క్యారెట్లలో ఉండే ఫైబర్ ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయకుండా చేస్తుంది. దీంతో ఆకలి నియంత్రణలో ఉంటుంది. కడుపు నిండిన భావనలో ఉంటారు. ఇది బరువు తగ్గాలనుకునే వారికి ఎంతగానో మేలు చేస్తుంది. క్యారెట్ జ్యూస్‌లో యాంటీ ఆక్సిడెంట్లు, పొటాషియం అధికంగా ఉంటాయి. ఇవి మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. దీంతో జ్ఞాపకశక్తి పెరుగుతుంది. క్యారెట్లను తింటున్నా లేదా జ్యూస్‌ను తాగినా మెదడుకు రక్త సరఫరా పెరుగుతుంది. దీంతో ఏకాగ్రత వస్తుంది. రోజూ ఉదయం క్యారెట్ జ్యూస్‌ను సేవిస్తే మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటారు. బద్దకం పోతుంది. ఇలా క్యారెట్ జ్యూస్‌ను రోజూ ఉదయం తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.




# ఘనం.. పీవీ వనం

**సువాసనల కల్యమాకు వంటకానికి అన్ని దినుసులూ కలిసి రుచిని కల్పిస్తాయి. సువాసన అద్దేది మాత్రం కరివేపాకే. దీన్ని 'కల్యమాకు, కర్రీపత్తా, కర్రీ లీవ్' అని కూడా పిలుస్తారు. కరివేపాకు చెట్టు మధ్యస్తంగా పెరిగే మొక్క. గోరింట, దానిమ్మ చెట్లలాగే 10 నుంచి 12 అడుగుల ఎత్తు పెరుతుంది. మా స్నేహితురాలి ఇంటి దొడ్లో మామిడి చెట్టుతో పోటీ పడి ఎదిగిన కరివేపాకు చెట్టు ఒకటుంది.**

కరివేపాకు కొమ్మకు ఉండే రెమ్మలు తుంచిన కొద్దీ కొత్తవి పిలకలు వేస్తాయి. ఆకులు వేపాకును పోలి ఉన్నా అంచులు మాత్రం సాఫీగా ఉంటాయి. ఇది అధిక ఉష్ణోగ్రతను తట్టుకొని పెరుగుతుంది. అనేక దేశాల్లో వంటకాల్లో సువాసన కోసం కరివేపాకును ఉపయోగిస్తారు. కరివేపాకు వేసిన పోపుతో కలిపిన పులిహోర తినని తెలుగువాళ్లు ఉండరు. సుగంధ భరితమైన ఆకును వంటల్లో ఉపయోగించినా, తినేముందు ఆకును తీసివేయడం ఎక్కువమందికి అలవాటు. దీని ఔషధ గుణాలు తెలిస్తే కరివేపాకుని తప్పకుండా తింటారు. కరివేపాకుని ఆయుర్వేదంలో ఔషధాల తయారీకి ఉపయోగిస్తారు. దీనిలో భాస్వరం, మెగ్నీషియం, ఇనుము వంటి ఖనిజ మూలకాలున్నాయి. విటమిన్ ఏ అధికంగా ఉండే కరివేపాకు తింటే కంటిచూపు మెరుగవుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకలు దృఢంగా తయారవుతాయి. జుట్టు సమస్యలనూ పరిష్కరిస్తుంది. కరివేపాకుని రైతులు వాణిజ్య పంటగా సాగు చేస్తున్నారు. దీని సాగుకు శ్రమ తక్కువ కాబట్టి ఎకరాల కొద్దీ సాగు చేస్తున్నారు. లాభాలు పండిస్తున్నారు. మా ఔషధవనంలో అర ఎకరాకుపైగా కరివేపాకు వనం సాగు చేస్తున్నాం. ప్రతి మూడు నెలలకు ఒకసారి మంచి దిగుబడినిస్తున్నది. చెట్టు కొమ్మలను నరికినా మళ్లీ మళ్లీ అంతకంటే రెండింతల కొమ్మలు చిగురిస్తున్నాయి. కరివేపాకు కాయలు కందిగింజ పరిమాణంలో గుత్తులు గుత్తులుగా కాస్తాయి. ఈ కాయలు ఎండిన తర్వాత విత్తుకోవచ్చు. మా ఇంటి ముందు పెద్ద రావి చెట్టు ఉంది. అది అనేక పక్షుల గూళ్లకు ఆలవాలం. వాటిలో పక్షులు తిని పడేసిన అనేక కరివేపాకు గింజలు వానకాలం వస్తే చాలు మా తోటంతా మొలకెత్తేవి.

# భారతీయ సినిమా పితామహులు ఫాల్కే

ఫిబ్రవరి 16.. దాదాసాహెబ్ వర్ధంతి




దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గురించి భారత దేశములో తెలియని వారు ఉండరేమో. . భారతీయ సినిమాకు గణనీయమైన సేవ చేసిన వారికి ప్రతి సంవత్సరం ఇచ్చే పురస్కారం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు. భారతీయ సినిమాకు పితామహుడుగా భావించబడే ఫాల్కే జన్మదిన సందర్భంగా 1963లో ఈ పురస్కారం ఏర్పాటు చేయబడింది. అయితే ఫాల్కే గురించి మాత్రం చాలా మందికి తెలియ దంటే ఆశ్చర్యం కలుగ మానదు.భారతీయ సినిమా పరిశ్రమ ప్రపంచంలోనే అతిపెద్ద పరిశ్రమలలో ఒకటి. ఎన్నో వేల కుటుంబాలకు జీవనాధారంగా ఉంటూ, కోట్ల ప్రజానీకానికి వినోదాన్ని, ఆటవిడుపునూ అందిస్తున్న సాధనం సినిమా. భారత సినీ పరిశ్రమకు ఆద్యునిగా పేరు గాంచింది దాదాసాహెబ్ ఫాల్కే. అతను అసలు పేరు ధుండిరాజ్ గోవింద్ ఫాల్కే. 1896లో అతను బొంబాయి లోని వాట్సన్ హోటల్‌లో ఏసుక్రీస్తు చరితం పై ప్రదర్శించ బడిన సినిమాను చూడటం జరిగింది. ఆ ప్రభావంతో అతను హైందవ దేవతలను చూపుతూ సినిమాలు తియ్యాలన్న సంకల్పానికి వచ్చారు. 1913లో అతను తీసిన రాజా హరిశ్చంద్ర సినిమాతో మొదలైన అతను సినీ జీవితం 19 సంవత్సరాలు సాగింది. సినీ నిర్మాతగా, దర్శకుడుగా, స్క్రీన్‌ప్లే-రచయితగా ఈ కాలంలో అతను 95 చిత్రాలను, 26 లఘుచిత్రాలను రూపొందించారు. 1870లో నాసిక్‌లోని త్రయంబకేశ్వర్‌లో 1870 ఏప్రిల్ 30 న జన్మించారు. బొంబాయిలోని జెజె కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌లో, బరోడాలోని కళాభవన్ విద్యార్థి. మంచి చిత్రకారుడు, నాటకాల్లో మేకప్ వేశారు. మంచి మెజీషియన్ కూడా... ప్రింటింగ్ ప్రెస్‌ను ఏర్పాటు చేశారు. ఆ కాలంలోనే ప్రింటింగ్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కోసం జర్మనీ వెళ్లాలనుకున్నారు. సినిమాకు సంబంధించిన వార్త ఒకటి పత్రికలో వచ్చింది. తనను ఆ వార్త బాగా ఆలోచింపజేసింది. మన దేశంలో కూడా సినిమాను ఎందుకు తీయకూడదు అనే ఆలోచన అతన్ని కుదురుగా ఉండనివ్వలేదు. తన వద్ద ఉన్న డబ్బు, మిత్రుల నుంచి తీసుకున్న అప్పు, జీవిత బీమా డబ్బు మొత్తం తీసుకొని సినిమా నిర్మాణానికి సంబంధించిన పరికరాలు కొనడానికి 1912లో ఇంగ్లాండ్ వెళ్లారు. అయితే ఫాల్కేకు తాను చరిత్ర సృష్టించబోతున్నానని తెలియదు, అదే తన జీవితాన్ని పేదరికం లోకి నెట్టివేస్తుందనీ ఊహించలేదు.ఫాల్కే 1913లో రాజా హరిశ్చంద్ర, ఆదే సంవత్సరం మోహినీ భస్మాసుర, సత్యవాన్ సావిత్రి (1914) శ్రీకృష్ణ జననం (1918) కాళీయ మర్దన్ (1919) నిర్మించారు. ఆ తరువాత సినిమా రంగంలో క్రమంగా వ్యాపార ధోరణి మొదలైంది. దాంతో పాల్కే పక్కకు తప్పుకున్నారు. సినిమా ప్రేమ ఆయన్ని నిలువనివ్వలేదు. తన పలుకుబడి, పరిచయాలు ఉపయోగించి నిధులు సమీకరించి 1937లో గంగావతరణ సినిమా తీశారు. నిండా మునిగి పోయారు. సినిమాను వ్యాపారంగా చూసి ఉంటే ఆయన పరిస్థితి బాగానే ఉండేది. సినిమాను విపరీతంగా ప్రేమించి దెబ్బతిన్నారు. తన వారసులను పేదరికంలోకి నెట్టేశారు. ఆయన దేశానికి తీసుకు వచ్చిన సినిమాతో సినీ వ్యాపారులు కోట్లు సంపాదించారు. పాపులారిటీని, రాజకీయాల్లో పదవులు సంపాదించారు కానీ ఫాల్కే మాత్రం కఠిక దరిద్రంలో మరణించారు. ఆయన కుమారుడు ముంబై వీధుల్లో చిల్లర వ్యాపారిగా జీవితం గడిపారు. బాగున్న రోజుల్లో ఫాల్కే ఫోర్డ్ కారును ఉపయోగించే వారు. 1920 ప్రాంతంలో ఆ కారులోనే షూటింగ్‌కు వెళ్లేవారు. తిరిగి సినిమా తీయాలని నిర్ణయించుకున్న కాలంలో దాన్ని అమ్మేశారు. ఆ కారు పెళ్ళిళ్ల ఊరేగింపునకు ఉపయోగించారు. ఐదేళ్ల క్రితం ఈ కారు నాసిక్ డంప్ యార్డ్‌లో లభించింది. తొలి భారతీయ సినిమా కెమెరాను ఫాల్కే జర్మనీ నుంచి తెప్పించారు. అదేమైందో ఇప్పుడు ఎవరికీ తెలియదు. సినిమా నిర్మాణానికి ఎలాంటి ఏర్పాట్లు లేని కాలంలో ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి ఫాల్కే తొలి సినిమా తీశారు. ఫాల్కే భార్య సరస్వతి భారతీయ తొలి సినిమా రాజా హరిశ్చంద్ర నిర్మాణంలో కీలక భూమిక పోషించారు. ఆమెనే తొలి భారతీయ సినిమా టెక్నీషియన్. సరస్వతి షూటింగ్ సమయంలో వెలుతురు కెమెరాపై పడకుండా బెడ్ షీట్‌ను అడ్డుగా పట్టుకుని ఉండేవారట. షూటింగ్‌కు కావలసినవన్నీ సమకూర్చేవారు. రాత్రి పూట క్యాండిల్ వెలుగులోనే ఈ సినిమాకు సంబంధించిన సాంకేతిక పనులు నిర్వహించే వారు. సినిమా బృందం 60-70 మందికి ఆమెనే వంట చేసి పెట్టేవారు. రాజా హరిశ్చంద్రలో హరిశ్చంద్రుని కుమారునిగా ఫాల్కే కుమారుడు బాలచంద్ర నటించారు. తొలి భారతీయ బాలనటుడు అతనే. శ్రీకృష్ణ జననం, కాళీయ మర్దన్‌లో బాల శ్రీకృష్ణునిగా మందాకిని నటించారు. ఆమె ఫాల్కే పెద్ద కూతురు. ఆమెనే తొలి భారతీయ బాలనటి.భారతీయ సినిమా రజతోత్సవ వేడుకల్లో దాదాసాహెబ్ ఫాల్కే ఒక అనామకుడిగా కూర్చోవడం చూసిన శాంతారాం ఆయన్ని గుర్తించి వేదికపైకి తీసుకు పోయి 1938లో అప్పటికప్పుడు వేదికపై ఐదువేల రూపాయల పర్స్ అంద జేశారు. ఆ డబ్బుతో ఫాల్కే తిరిగి సినిమా తీస్తాడేమోనని చాలా మంది భయపడ్డారు. ఎందుకంటే సినిమా అంటే ఆ మహనీయునికి అంత పిచ్చి. అందరూ ఒత్తిడి తెచ్చి ఆ డబ్బుతో నాసిక్‌లో ఒక ఇంటిని కొనిపించారు. అప్పటి వరకు ఫాల్కేకు సొంత ఇల్లు కూడా లేదు. ఆ ఇంటిలోనే తుది శ్వాస విడిచారు..1971 లో ఆయన గౌరవార్థం ఇండియా పోస్ట్ ప్రత్యేక స్మారక తపాలా బిళ్లను విడుదల చేసింది. ఫిబ్రవరి 16, 1944 న మరణించారు. 90 సినిమాలను నిర్మించిన భారతీయ సినిమా పితామహుడు దరిద్రంతోనే కన్నుమూసినా, ఈ నాటికీ అతని జీవన మూల్యాలు ఆదర్శంగా, స్ఫూర్తినిచ్చేవిగానే ఉన్నాయి. అతని పేరు మీద జాతీయ అవార్డుల సంరంభం ప్రతి యేటా జరుగుతున్నా, ఆయన జీవిత చరమాంకం ఎంతటి దైన్యావస్థలో గడిచిందో ఎవరూ తలచక పోవటం శోచనీయం.

రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# అలుపెరుగని పోరాట యోధుడు లోక్ సత్తా శ్రీనివాస్

## నరెడ్ల శ్రీనివాస్ యాదిలో...



నరెడ్ల శ్రీనివాస్ అంటే తెలియక పోవచ్చు కాని, లోక్ సత్తా శ్రీనివాస్ అనగానే ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు సుపరిచితమే. చాలా మంది ఆయనను లోక్ సత్తా శ్రీనివాస్ అనే పిలిచేవారు. సామాజిక న్యాయం, ఉద్యమాలకు ఆయన కేర్ ఆఫ్ అడ్రస్ గా నిలిచారు. ఉత్తర తెలంగాణలో గత ఆ నాలుగు దశాబ్దాలుగా కొనసాగిన సామాజిక ఉద్యమా లతో ఆయన భాగస్వామ్యం లేని ఉద్యమమే లేదంటే అతిశయోక్తి కాదు. లోక్ సత్తా ఉద్యమ సంస్థతో గత పాతికేళ్లుగా ఆయనకు విడదీయరాని సంబంధం ఉంది. లోక్ సత్తా అంటే శ్రీనివాస్. శ్రీనివాస్ అంటే లోక్ సత్తా అని పేరెన్నిక గన్నారు. అవినీతి, అన్యాయాలు అక్రమాలపై నిరంతరమైన పోరాటాలు చేశారు. ఎన్నో విజయాలు సాధించారు. కరీంనగర్ లో ఉన్న అన్ని ఉద్యమ వేదికలు ఆయనవే. గత సామాజిక ఉద్యమా లతో ఆయనకు విడదీయరాని బంధం సంబంధం అనుబంధం ఉన్నాయి. ఆయన ప్రతి ఉద్యమం లో క్రియాశీలక పాత్ర పోషించారు. వాస్తవానికి ఉద్యమాలను నిర్మించారంటే సమంజసంగా ఉంటుంది. ఉద్యమాల నిర్వహణలో అలుపెరగక, ఏనాడూ రాజీ పడక, మొక్కవోని ధైర్యంతో, చెక్కు చెదరని ఆత్మ విశ్వాసంతో, అకుంఠిత కార్యదీక్ష తో, అంకిత భావంతో, అన్నింటినీ మించి చిత్తశు ద్ధితో, ఉద్యమాలలో మమేకమైన పోరాట యోధుడు.1955లో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామంలో నిరుపేద కుటుంబంలో నరెడ్ల శ్రీనివాస్ జన్మించిన శ్రీనివాస్... యూనియన్ బ్యాంకులో ఉద్యోగం చేస్తూ, బ్యాంకు మేనేజర్ గా ప్రమోషన్ మీద కొంత కాలంగా రాష్ట్రం విడిచి వెళ్ళిన సందర్భంలోనూ, ఏనాడూ ఉద్యమ కార్యా చరణను ఆయన వదిలి పెట్టలేదు. వినియోగదారుల మండలి తరపున వందలాది కేసులు వేసి హక్కులను పరిరక్షిం చేందుకు కృషి చేశారు. అవినీతి అధికారులను ఏసీబీకి పట్టించడం లో కృషి చేసిన వారిని సన్మానించి ప్రోత్స హించేవారు. పాలకుల తప్పులను, ప్రభుత్వ పాలసీల్లోని లోపాలను ఎత్తి చూపడంలో, ప్రజా సమస్యలతో పాటు, సామాన్య బాధితుల న్యాయం కోసం పోరాడ డంలో ఆయన వ్యక్తిత్వం అనన్య సామాన్యం. ఉమ్మడి రాష్ట్ర వినియోగ దారుల మండలి అధ్యక్షుడిగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో అందరికీ అందు బాటులో ఉండేలా కిరాయి ఇల్లు వేదికగా, కరీంనగర్ వినియోగ దారుల మండలి నిర్వాహక బాధ్యునిగా, వేలాది కేసులను ఆయన పరిష్కరించారు. అన్యా యానికి గురైన వారు తమకు న్యాయం తప్పక జరుగుతుందని నమ్మకంతో, లోక్ సత్తా ఆఫీసును వెతుక్కుంటూ వచ్చేవారు. వారి సమస్య పరిష్కారం అయ్యే దాకా సలహాలు సూచనలు అందించ డమే కాక, వెంట ఉండి సహకరించే వారు. హుజురాబాదులో జన్మించిన 69ఏళ్ళ శ్రీనివాస్... విద్యార్థి జీవితం లోనే ప్రగతిశీల భావాలు కలిగి, ఆనాటి పోరాట, విప్లవ యోధుల సాహచర్యంతో ఎదిగారు.1970వ దశక ప్రారంభంలో మిత్రులతో కలిసి హుజురాబాద్ లో సాహితీ సంస్థ స్థాపనకు చొరవ చూపి, మహాకవి శ్రీశ్రీని ఆహ్వానించి, హుజురాబాద్ లో సమావేశాలు నిర్వహించడంలో ప్రధాన పాత్ర పోషించారు. కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్ కాలేజీలో డిగ్రీ, ఉస్మానియాలో పీజీ పూర్తి చేసి, కరీంనగర్ యూనియన్ బ్యాంక్ లో ఉద్యోగంలో చేరారు. ప్రగతి శీల, భావజాల పరిధిని విస్తృత పరుచుకుని, తన లాంటి భావాలున్న వారితో జత కట్టారు. ఒకనాడు జర్నలిస్టులకు వేదికగా, ఎందరో జర్నలిస్టులను తయారు చేసి, జర్నలిస్టుల తయారీ కర్మాగా రంగా విలసిల్లిన, విజయ కుమార్ సంపాదకత్వంలో వెలువ రించిన 'జీవగడ్డ పత్రికలో వారం వారం 'పెన్నుపోటు' పేర కాలమిస్టు గా పని చేశారు. ఆకాలంలో జీవగడ్డలో పని చేసిన అల్లం నారాయణ, ఘంటా చక్రపాణి, ఆనాడు జిల్లాలో విధులు నిర్వర్తించిన సీనియర్ జర్నలిస్టు మిత్రులు దేవులపల్లి అమర్, దామెర్ల సాయిబాబా, ఎస్. కె.జకీర్ తదితరులతో సాన్నిహిత్యాన్ని పెంచుకున్నారు. కరీంనగర్ వినియోగదారుల మండలి స్థాపించి వినియోగ దారుల పరిరక్షణ చట్టం కింద, రశీదో, బిల్లో, ఏ చిన్న ఆధారం తోనైనా సరే, ఫోరం కోర్టుల్లో వేలాది కేసులు వేస్తూ మోస పోయిన వినియోగ దారులకు లక్షలాది రూపాయల నష్ట పరిహారాలు వచ్చేలా కృషి చేశారు. అలాగే సమాచార హక్కు చట్టాన్ని మరొక ఆయుధంగా చేసుకుని సామాన్యు లకు అండగా నిలిచారు. ఈ చట్టం కింద భూ కబ్జాలు, గ్రానైట్ రాళ్ళ సంభకోణాల లాంటివి బహిర్గత పరిచి, ప్రభుత్వానికి కోట్ల రూపాయల లబ్ధిని చేకూర్చారు. లోక్ సత్తా బాధ్యునిగా, జయప్రకాష్ నారాయణను కరీంనగర్ పలు మార్లు రప్పించి, చిత్తశుద్ధితో పని చేశారు. సమాజంలోని అవినీతి అక్రమాలపై అలుపెరుగని, అవిశ్రాం త పోరాటం చేసి, ఆశయ సాధనకు కృషి చేసిన పోరాట యోధుడు, నరెడ్ల చివరికి కరోనా మహమ్మారి తోనూ పోరాటం చేసి, ఓటమి పాలై, పోరాట యోధుని గానే 2021 ఫిబ్రవరి 15న తనువు చాలించారు. ఆయన పోరాటం ఎందరికో స్ఫూర్తి దాయకం అయిందనేది వాస్తవం.

-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# తెలుగు పత్రికా రంగానికి మార్గ నిర్దేశకుడు నార్ల

### నార్ల వెంకటేశ్వరరావు వర్ధంతి

నార్ల వెంకటేశ్వరరావు... పరిచయం అక్కర్లేని పేరు. నిర్భయానికి, నిక్క చ్చితత్వానికి, నిబద్ధతకు మారు పేరు. వృత్తి నిబద్ధతతో నిర్వహిం చారు. వృత్తి నిర్వహణ సామాజిక బాధ్యతగా భావించారు. పత్రికా రంగానికి మార్గదర్శకులు, జర్నలిస్టు లకు దిశానిర్దేశకులు. ఆయనొక విజ్ఞాన సర్వస్వం. అయన జీవితం సంస్కరణల మయం. రచన ఏది చేసినా, ప్రక్రియ ఏదైనా, ప్రజా చైతన్యమే ఆయన లక్ష్యం. లక్ష్య సిద్ధి కోసం ఎన్ని అడ్డంకులు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో ముందుకే సాగిన వైనం. రచయితగా, నాటకకర్తగా, విమర్శ కుడిగా, అనువాదకుడిగా బహు ముఖ పాత్రలు పోషించిన ఆయన జీవిత పర్యంతం హేతుబద్ధమైన ఆలోచనల ద్వారా సామాజిక స్పృహ కల్పించే ప్రయత్నం చేశారు. ఆంగ్ల భాషలోనా నిష్ణాతులైనా, తెలుగు ప్రజలకు తన రచనలు చేరువ కావాలనే తలంపుతో, తెలుగు పత్రికా రంగాన్ని కావాలనే ఎంచుకున్నారు.



మధ్య ప్రదేశ్ లోని జబల్‌పూర్‌లో డిసెంబర్ 1, 1908 జన్మించిన నార్ల, విద్యాభ్యాసం కృష్ణా జిల్లాలో జరిగిం ది. వెంకటేశ్వరరావు ఏప్రిల్ 3, 1958 నుండి ఏప్రిల్ 2, 1970 వరకు రెండు పర్యాయాలు రాజ్యసభ సభ్యునిగా పని చేశారు.స్వరాజ్య, జన వాణి, ప్రజా మిత్ర పత్రికలో పని చేసి, ఆంధ్ర ప్రభ, చివరకు ఆంధ్ర జ్యోతి పత్రికలకు ఎడిటర్ గా విధులు నిర్వర్తించారు. విధి నిర్వహణలో ఎన్నడూ అయన రాజీ పడలేదు. ఆయన సంపాద కీయ రచనలు సూటిదనం, గడుసు దనం, వ్యంగ్యం, చమత్కారం, లోక జ్ఞత, సమయజ్ఞత కల గలిపి ఉండే వి. పండితునికి, పామరునికి తెలు గు భాష అర్థమయ్యే రీతిలో నార్ల సంపాదకీయాలు, రచనలు చేశారు. "వాస్తవమ్ము నార్లవారి మాట" మకుటంతో ఆటవెలదులు రచించారు. "నవయుగాల బాట నార్ల మాట" మకుటంతో 700కు పైగా సందేశాత్మక పద్యాలు రాశారు. 16 ఏకాంకికల సంపుటి వెలువరించారు. నార్ల సొంత గ్రంథాలయంలో 20,000 పుస్తకాలు ఉండేవట అంటే మాటలు కాదు.సంపాదకుడు అనే మాటను అయన అంగీకరించ లేదు. ఆమోదించ లేదు. ఎడిటర్ అనే పదాన్నే వాడే వారు. నార్ల... టంగుటూరి ప్రకాశం, నీలం సంజీవరెడ్డి, , కాసు బ్రహ్మానంద రెడ్డి, ఎన్.జి. రంగా ఎవరినీ వదల లేదు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ చాందసాన్ని విమర్శించక మాన లేదు. ఇందిరా గాంధి, ఆమె కుటుంబ వారసత్వ రాజకీయాల్ని ద్వేషించారు. ఆయన వ్యాసాలను నిరక్షరాస్యులు గ్రామాల్లోని రచ్చబండల దగ్గర చదివి వినిపించుకునే వారంటే ఆయనలోని రచనా వ్యాసంగ శక్తి ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు.ఆంధ్రప్రభ నుంచి వైదొలిగిన సందర్భంలో, నార్ల కోసం కొందరు ముఖ్యులు కలిసి ఆంధ్ర జ్యోతి పత్రిక ప్రారంభించారంటే ఆయన గొప్పతనం స్పష్టం అవుతున్నది. గోరాశాస్త్రి మాటల్లో చెప్పాలంటే 'కేవలం సత్వగుణ ప్రధానంగా, అచ్చ తెలుగులో చప్పచప్పగా ఉన్న పత్రికా రచనలో వాడినీ, వేడినీ సృష్టించి, తెలుగు నుడికారంలో ఎంత 'కారం' ఉందో తెలియజెప్పిన వాడు' నార్ల. "యొక్కలతో తెలుగుభాష డొక్క పొడవొద్దు...ఎంత గొప్ప వాడైనా వస్తాడే కాని విచ్చేయుడు...సంపాదకుడు అనొద్దు ఎడిటర్ అనండి...బడు వాడేవాడు బడుద్దాయి. అంటూ పత్రికా భాష ఎలా ఉండాలో దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఫిబ్రవరి 16, 1985న ఈ లోకాన్ని వీడి వెళ్లిన నార్ల తెలుగు సాహిత్య, పత్రికా రంగాలలో చెరగని ముద్ర వేసి వెళ్లారు."ఎడిటరైన వాడు బిడియము చూపుచో ధాటి తగ్గ వృత్తి ధర్మమందు, కడుపుకూటి రాత కక్కుర్తి రాతరా""నిజము కప్పిపుచ్చి నీతిని విడనాడి స్వామి సేవ సేయు జర్నలిస్టు తార్పువాని కంటే తక్కువ వాడురా" అంటూ విలువలు వీడ వలదని హితవు పలికారు. ప్రస్తుత పరిస్థితులలో ఆయన చేసిన మార్గ నిర్దేశం నేటి జర్నలిస్టులకు నిజంగానే శిరోధార్యం.

**-రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**

# అసమాన పరిశోధకుడు మేఘనాథ్ సాహా

మేఘనాథ్ సాహా (1893 అక్టోబరు 6 ౼ 1956 ఫిబ్రవరి) భారత దేశానికి చెందిన సుప్రసిద్ధ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త. నక్షత్రాలలో జరిగే మార్పు లు, ఉష్ణోగ్రత, పీడనం లాంటి ఎన్నో ధర్మాల్ని ఆవిష్కరించే సమీకరణాలను కనుగొన్నాడు.ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో గల ఢాకాలోని సియోర్ తలి గ్రామంలో 1893 అక్టోబరు 6న, జన్మించిన మేఘ నాథ్ సాహా, చదువులో బాల్యం నుండే రాణించాడు. తండ్రి సంపాదన చాలక పోవడంతో ఆ కుటుంబం తరచు పస్తులతో గడపాల్సి రాగా, సాహాను బడి మానిపించి ఏదైనా పనిలో పెట్ట దానికి తండ్రి ప్రయత్నించాడు. అయితే సాహా చురుకు దనాన్ని గమనించిన ఉపాధ్యాయులు తండ్రికి నచ్చచెప్పి దాతల సాయం తో ఓ బోర్డింగ్ స్కూలులో చేర్పారు. సాహా చక్కగా చదువుతూ స్కాలర్‌షిప్‌లు సాధించి పై చదవుల కోసం ఢాకా వెళ్లాడు.ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం బెంగాల్ ను విభజించి నందుకు నిరసనగా పన్నెండేళ్ల సాహా, గవర్నర్ తమ స్కూలును సందర్శి స్తున్న కార్యక్ర మాన్ని స్నేహితులతో బహిష్కరించి డిస్మిస్ అయ్యాడు. మరో స్కూల్లో చేరి అక్కడ కూడా స్కాలర్‌షిప్ సాధించాడు. కలకత్తా ప్రెసిడెన్సీ కళాశాలలో ఆయనకు బోధించిన వారిలో ప్రఖ్యాత శాస్త్రవేత్తలు జగదీశ్ చంద్రబోస్, పీసీ రే ఉండగా, అతడి క్లాస్‌మేట్స్‌లో సత్యేంద్రనాథ్ బోస్, పీసీ మహలనోబిస్ కూడా శాస్త్రవేత్తలు



కావడం విశేషం.ఎమ్మెస్సీ తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వక పోవడంతో ఉపాధి కోసం ట్యూషన్లు చెబుతూనే పరిశోధనల్లో నిమగ్నమయ్యాడు. తర్వాత కలకత్తాలో అధ్యాపకుడిగా చేరిన ఆయన ఖగోళ భౌతిక శాస్త్రంపై పట్టు సాధించాడు. సూర్యకాంతి గాజు పట్టకం ద్వారా ప్రసరించి నప్పుడు ఏర్పడే వర్ణపటం ఎందుకు ఏర్పడుతుందో చెబుతూ అయనీ కరణ సూత్రాన్ని ప్రతిపాదించాడు. సూర్యుని ఉష్ణోగ్ర తలు, స్వభావం, సంయోజనం లాంటి ధర్మాలను విశ్లేషించాడు. ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీ (లండన్) గా ఎన్నికయ్యాడు. అలహాబాదు యూనివర్శిటీలో ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా వర్ధపట విజ్ఞానం, అయనా వరణం పై పరిశోధనలు చేశాడు. సూర్య కిరణాల బరువును, వత్తిడిని కనిపెట్టే పరికరాన్ని రూపొందిం చాడు. ఇంకా పురాతన శిలలు, సూర్యుని నుంచి వెలువడే రేడియో తరంగాలు, రేడియో ధార్మికతలపై కూడా పరిశోధన లు చేశాడు. కలకత్తా విశ్వ విద్యాల యంలో న్యూక్లియర్ ఫిజిక్స్ విభాగా న్ని1948లో సాహా ప్రారంభించాడు. దేశంలో పరమాణు కణాల త్వర ణాన్ని పెంచే తొలి యాక్సిలరేటర్ ఆయన పర్యవేక్షణ లోనే నిర్మిత మైంది. సైన్స్ అండ్ కల్చర్ పత్రికను నడిపాడు. ఆయన రాసిన 'ఎ ట్రిటైజ్ ఆన్ హీట్' ఓ ప్రామాణిక పాఠ్య గ్రంథం.1923 లో సాహా అలహాబాదు విశ్వ విద్యాలయంలో ఆచార్యుడయి నాడు. 1927 లో రాయల్ సొసైటీ లో సభ్యత్వం లభించింది. 1934లో 21వ భారత సైన్సు కాంగ్రెస్ సదస్సు కు అధ్యక్షత వహించాడు. 1938 లో కలకత్తా విశ్వ విద్యాలయానికి వెళ్ళాడు. అక్కడ కలకత్తా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్ ను నెలకొల్పి దానికి గౌరవా ధ్యక్షుడిగా ఉన్నాడు. సాహా ఫిబ్రవరి 16, 1956న మరణించాడు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

**- ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్**

**దౌల్తాబాద్, ఫిబ్రవరి 16 (నినాదం న్యూస్):** మద్యం తాగి వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ హెచ్చరించారు. ఆదివారం ఉప్పరపల్లి శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేయడంతోపాటు సరైన ధ్రువపత్రాలు లేని, పెండింగ్ చలాన్లు ఉన్న వాహనదారులకు జరిమానా విధించారు. ప్రతిఒక్కరూ విధిగా వాహనాలకు సంబంధించిన పత్రాలు కలిగి ఉండి, తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్సై సూచించారు.

## బీఆర్ఎస్ సీనియర్ నాయకుడుని పరామర్శించిన పలువురు

**దౌల్తాబాద్, ఫిబ్రవరి 16 (నినాదం న్యూస్):** మండల పరిధిలోని దొమ్మాట మాజీ సర్పంచ్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గన్నమనేని మోహన్ రావు విద్యుత్ ప్రమాదానికి గురి కావడం పట్ల విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఆదివారం మోహన్ రావు ను వారు పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. వారి వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ రహీమొద్దీన్ ఉన్నారు.

## పోదాం పదండి

# పెద్దగట్టు జాతరకు...

కాళ్ళకు గజ్జెలు కట్టుకొని డిల్లెం బల్లెం శతాబ్దాల నడుమ ఓ లింగ ఓ లింగ అని అంటూ లింగమంతుల స్వామి వారికి స్మరిస్తూ కొనసాగే జాతర ఆ జాతరను చూడడానికి మనకు రెండు కళ్ళు చాలవు తెలంగాణ ప్రాంతంలో సమ్మక్క సారలమ్మ జాతర లేని సమయంలో ఈ జాతర వేడుకలు నిర్వహించడం తెలంగాణ ప్రాంతంలో ఓ సంప్రదాయంగా వస్తుంది. అదే తెలంగాణ రాష్ట్రంలో జరిగే అతిపెద్ద జాతర లో రెండవ జాతర అదే పెద్దగట్టు జాతర.యాదవుల కులదైవంగా ప్రసిద్ధిగాంచిన పెద్దగట్టు లింగమంతులస్వామి జాతర ఘనంగా ప్రారంభమైంది. మేడారం తర్వాత తెలంగాణలో అతిపెద్దదిగా పేరుగాంచిన గొల్లగట్టు జాతర రెండేళ్లకు ఒకసారి జరుగుతుంది. ఈ జాతరలో కీలక ఘట్టమైన దేవరపెట్టె(అందనపు చౌడమ్మపెట్టె) తరలింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ జాతర గురించి స్థానికంగా అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. స్థల పురాణం ప్రకారం.. రాష్ట్రకూట వంశానికి చెందిన ధ్రువుడు తన పేరిట ఇక్కడ గ్రామాన్ని నిర్మించాడనీ, అదే కాలక్రమంలో దురాజ్‌పల్లిగా మారిందని అంటారు. కాకతీయుల కాలంలో ఉండ్రు కొండపై శివకేశవుల ఆలయాలు ఉండేవి. ఇక్కడ ఏటా అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించేవారు. ఈ ఉత్సవాల్లో మొక్కులు చెల్లించేందుకు గుట్టకు వచ్చిన ఓ గర్భిణి పైకి ఎక్కుతుండగా జారిపడి మరణించిందని, ఈ ఘటనకు చలించిపోయిన స్వామివారు భక్తులకు వీలుగా ఉండేట్లు పాలసేర్లయ్య గుట్టపై లింగమంతుల స్వామిగా వెలిశారని స్థానికులు చెబుతారు.రెండేళ్లకు ఒకసారి జరిగే లింగమంతుల జాతర ప్రారంభానికి 15 రోజులు ముందు దిష్టిపూజ మహోత్సవం జరుగుతుంది. మాఘశుద్ధ పాడ్యమి తర్వాత వచ్చే రెండో ఆదివారం దిష్టి కుంభాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా చీకటాయపాలెం నుంచి దేవరపెట్టెను తీసుకురాగా.. సూర్యాపేట నుంచి మకరతోరణం ఇతర ఆభరణాలు పెద్దగట్టుకు తీసుకొచ్చి అలంకరిస్తారు. ప్రతీ ఆది, సోమవారాల్లో పూజలు జరుగుతుంటాయి. ఆదివారం ప్రారంభమైన ఈ జాతర ఐదు రోజుల పాటు జరుగుతుంది.అందనపు చౌడమ్మ తల్లి దేవరపెట్టెలో ఉంటుంది. ఉత్సవాల్లో ఊరేగిస్తుండగా దేవర కోసం ఎదురుచూస్తున్న భక్తులు ఓ లింగా.. ఓ లింగా అని స్మరిస్తూ దేవరపెట్టెను తాకుతారు. ఇలా తాకడం వల్ల పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. చౌడమ్మను సౌడమ్మతల్లిగా, చండీమాతగా కూడా పిలుస్తారు. యాదవుల కులదేవత సౌడమ్మ ఆలయాలు సూర్యాపేట, దురాజ్‌పల్లి, పెన్‌పహాడ్ గ్రామాల్లో తప్ప మరెక్కడా కనిపించకపోవడం విశేషం. జాతరలో భాగంగా పొట్టేలును తీసుకొచ్చి దానికి పూలదండ వేసి పసుపు, కుంకుమ పెట్టి దేవుడు ఉన్న దిక్కువైపు వదిలేస్తారు. గొర్రె జల్లి ఇవ్వగానే మొక్కు తీర్చుకుంటారు.లింగమంతు స్వామి శాఖాహారి కావడంతో ఆయనకు నైవేద్యం సమర్పిస్తారు. మిగితా దేవతలకు జంతుబలులు ఇస్తారు. జాతరకు ఒకరోజు ముందు భక్తులు చేరుకుంటారు. పురుషులు ఎరుపురంగు వస్త్రాలు ధరించి, కాళ్లకు గజ్జెలు కట్టుకొని డిల్లెం బల్లెం శబ్దాల నడుమ నడుస్తూ ఓలింగా.. ఓ లింగా అంటూ హోరెత్తిస్తారు. ఇక, మహిళలు తడి బట్టలతోనే పసుపు, కుంకుమ, పూల దండలు, అగరవత్తులతో అలకరించిన మంద గంప నెత్తిన పెట్టుకొని నడుస్తారు. సంతానంలేని మహిళలు బోనం కుండ ఎత్తుకుంటారు. పిల్లలు లేనివారు స్నానం చేసి తడిబట్టలతో గుడిచుట్టూ ప్రదక్షిణలు చేస్తే స్వామి అనుగ్రహంతో సంతానం కలుగుతుందని నమ్మకం. దీనిని పానసారం పట్టడం అంటారు. మునుపెన్నడూ లేని విధంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తెలంగాణ చారిత్రక సంప్రదాయాలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రభుత్వం పండుగలు పబ్బాలకు పెద్దపీఠం వేస్తూ తెలంగాణ ప్రజల చారిత్రక సంప్రదాయాలను కాపాడుతుంది. పెద్దగట్టు జాతర మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది తెలంగాణలో.....

# విమాన ప్రయాణాలు ఎంత వరకు సురక్షితం.. !

ఇటీవల అమెరికాలో సైనిక హెలికాప్టర్, అమెరికన్ పౌర విమానం ఢీకొన్న దుర్ఘటనలో 64 మంది దుర్మరణం పాలయ్యారు. అదే విధంగా దక్షిణ కొరియాలో ఇటీవలే జరిగిన ఘోర విమాన ప్రమాదంలో ఏకంగా 179 మంది దుర్మరణం పాలవడం వింటేనే విమాన ప్రయాణం అంటే ఱుకు పుట్టేస్తున్నది. 175 మంది ప్రయాణికులులతో పాటు ఆరుగురు సిబ్బందితో కూడిన విమానం థాయిలాండ్ నుంచి సియోల్‌కు 290 కిమీ దూరంలో ఉన్న ముయాన్‌కు బయలుదేరి జెజు ఎయిర్‌కు చెందిన బోయింగ్ జెట్ విమానం దిగుతుండగా కుప్పకూలిపోయి రక్షణ గోడను ఢీకొని ముక్కలై పోయి 179 మందిని పొట్టన పెట్టుకుంది. ఇద్దరు సిబ్బంది మాత్రమే గాయాలతో బయట పడ్డారు. ప్రపంచవ్యాప్తంగా 2024లో జరిగిన అత్యంత ఘోర విమాన ప్రమాదంగా దీనిని గుర్తిస్తున్నారు. అదే విధంగా ప్రపంచ క్రిస్టియన్లు బాక్సింగ్ డే వేడుకల్లో మునిగిన వేళ అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం 25 డిసెంబర్‌న కజకిస్థాన్‌లో కూలిపోవడంతో 38 ప్రాణాలు కోల్పోవడం, 29 మంది గాయాలతో బయట పడడం కూడా మనల్ని కలిచి వేసిన ప్రమాదంగా మన మనసుల్లో నమోదు అయ్యింది. ఈ విమానాన్ని రష్యా మిలిటరీ కూల్చి వేసిందనే ఆరోపణ కూడా వినవలసిరావడం విచారకరం.

2024లో అత్యంత ఘోరమైన వాణిజ్య విమానాల ప్రమాదాలు:



తరుచుగా జరుగుతున్న వాణిజ్యపరమైన విమాన ప్రమాదాలు ప్రపంచ ప్రయాణికుల గుండెల్లో వణుకును పుట్టిస్తున్నాయి. ఏవియేషన్ వర్గాల అధ్యయనాల ప్రకారం 53 శాతం విమాన ప్రమాదాలు మానవ తప్పిదాలతో, 21 శాతం మెకానికల్ వైఫల్యాలతో, 11 శాతం ప్రతికూల వాతావరణాల వల్ల జరుగుతున్నట్లు తేలింది. అయినప్పటికీ రోడ్డు, రైలు ప్రయాణాలతో పోల్చితే విమాన ప్రమాదాలు చాలా తక్కువగా నమోదు అవుతున్నట్లు వివరిస్తున్నారు. 2018-22 మధ్య సమయంలో ప్రపంచవ్యాప్తంగా 13.7 మిలియన్ల విమానయాన ప్రయాణీకుల్లో ఒక్క ప్రయాణీకుడు మాత్రమే ప్రమాదంలో ప్రాణం కోల్పోయినట్లు గణాంకాలు తేలుపుతున్నాయి. అదే విధంగా 16 మిలియన్ల వాణిజ్య విమానాల్లో ఒక్కటి మాత్రమే ప్రమాదానికి గురి అవుతున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. 2024లో ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన వాణిజ్యపరమైన విమాన ప్రమాదాలు 20 వరకు జరుగగా, అందులో 400 వరకు ప్రయాణీకులు మరణించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2024లో రష్యా మిలటరీ విమాన కూల్చివేతలో 74 మంది, బ్రెజిల్ ప్రమాదంలో 62 మంది, కాట్మండు ప్రమాదంలో 18 మంది, రష్యా విమాన ప్రమాదంలో 15 మంది, లుతువానియా విమాన ప్రమాదంలో నలుగురు ప్రయాణీకులు/సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. భారత్‌లో మాత్రమే ఒక్క ఏడాది 2022లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1.69 లక్షల మంది ప్రాణాలు వదిలారు 2023లో సగటున రోజుకు 474 మంది ప్రజలు మరణిస్తున్న విషయం మరువరాదు. 2014-23 మధ్య కేవలం భారత్‌లో జరిగిన 638 రైలు ప్రమాదాల్లో 2,453 మంది మృతి చెందినట్లు తెలుస్తున్నది. విమాన ప్రయాణాల భద్రతకు విమాన పైలెట్ సిబ్బంది, విమాన ఇంజన్ కండీషన్, సిబ్బందికి అందించే శిక్షణ లాంటి అంశాలు సంబంధాన్ని కలిగి ఉంటాయి. విమాన ప్రమాదాలకు కొంత వరకు పక్షులు ఢీకోవడం కూడా మరో కారణంగా గుర్తించబడింది. ఇప్పటికైనా విమానయానాలు పరలోక ప్రయాణాలు కాకుండా వారిని సురక్షితంగా తమ తమ గమ్యస్థానాలకు చేర్చాలని, మానవ తప్పిదాలను పూర్తిగా తప్పించాలని కోరుకుందాం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# గణిత అండ్ సైన్స్ ఒలంపియాడ్ పరీక్షల్లో

## విజ్ డమ్ హై స్కూల్ విద్యార్థుల అపూర్వ ప్రతిభ

**నర్సంపేట, ఫిబ్రవరి 16 (నినాదం న్యూస్):** శ్రీనివాస రామానుజన్ రాష్ట్రస్థాయి గణిత సైన్స్ ఒలంపియాడ్ పరీక్షల్లో విజ్ డమ్ హై స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్ర జిల్లాస్థాయిలో పతకాలను సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ ప్రిన్సిపాల్ జావేద్ ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో నిన్న జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో పాఠశాలకు చెందిన 8వ తరగతి కే. కౌశిక్ గణిత ఒలంపియాడ్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం, 4వ తరగతి లిమీర్ ఉస్మాన్ అలీ సైన్స్ ఒలంపియాడ్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించగా, గణిత, సైన్స్ ఒలంపియాడ్ పరీక్షల్లో జిల్లా స్థాయిలో 10 వ తరగతి ముంజాల సాయి కిరణ్, అనన్య, అర్జున్, అన్వేష్, సుహాస్ ప్రిన్స్, 9వ తరగతి అర్మాన్ షా, ఫర్మాన్ షా, అబ్దుల్ ముఖీత్, మనోజ్ఞ, 8వ తరగతి దాసరి నిహారిక, సాయిహర్ష, బేరి మనోజ్ఞ, సుశాంత్, 7వ తరగతి అసద్, సుశాంత్, కొప్పు యశ్వంత్, విశ్వేశ్ చౌహాన్, చెన్నబోయిన చరణ్, షహజాద్, 6వ తరగతి పుల్లూరి రాజా గౌడ్, శశిధర్, శ్రీనిధి, నాసిర్ అలీ, 5వ తరగతి అంకిత్ చంద్ర, సాత్విక్ కృష్ణ, శ్రీహిత్ రెడ్డి, చరణ్, 4వ తరగతి మీర్ ఉస్మాన్ అలీ, మహమ్మద్ డ్యానిష్, షణ్ముఖ ప్రియ, 3వ తరగతి హిమాచరితారెడ్డి, ప్రేమ్ విరాన్, తన్మయ్ శ్రీలు బహుమతులు సాధించారు. కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, ఏసీపీ పింగళి ప్రతాపరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రవీందర్, తిరుమలరావు, ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ చైర్మన్ అమరేష్‌లు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో రాణించి పాఠశాల పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేసిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ జావేద్, కరస్పాండెంట్ జహంగీర్, అకాడమిక్ ఇన్చార్జి నాజియా ఇక్బాల్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్, ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ ఫహీమ్ సుల్తాన, రఘుపతి రెడ్డి, శివరాజ్ లతోపాటు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

# స్నేహితుడు కుటుంబానికి చేయూత

## - సిద్దిపేట ఎస్ఎంహెచ్ పూర్వ విద్యార్థుల ఆపన్నహస్తం

**దౌల్తాబాద్, ఫిబ్రవరి 16 (నినాదం న్యూస్):** వారు రక్త సంబంధికులు కారు, ఒక్క ఊరు వారు కాదు, బంధువులు అంతకన్నా కాదు, కానీ తమతో కలిసి చదువుకున్న మిత్రుని కుటుంబం ఆపదలో ఉందని తెలుసుకొని, తలకొంత పోగేసుకొని ఆ కుటుంబానికి మేమున్నాం అని చాటి చెప్పారు. గుండెపోటుతో అకాల మరణం చెందిన స్నేహితుని కుటుంబానికి మిత్రులు అండగా నిలిచి, ఆ కుటుంబానికి మేమున్నాం అని భరోసా కల్పించారు. స్నేహితులంతా కలిసి 30 వేల ఆర్థిక సాయం చేయడంతో పాటు మృతుని పిల్లల పై చదువుల కోసం అండగా ఉంటామని హామీ ఇచ్చారు. దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్ సిద్దిపేటలోని స్టూడెంట్ మేనేజ్ మెంట్ హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యను అభ్యసించాడు. అనంతరం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రయివేటు జాబ్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకున్నాడు. కాగా ఇటీవల గుండెపోటుతో అకాల మరణం పొందాడు. దింతో అతనితో కలిసి చదువుకున్న మిత్రులు అతని కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించుకున్నారు. ఎస్ హెచ్ ఎమ్ వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారం అందుకోని 30 వేల రూపాయలు సేకరించి ఆదివారం ఆ కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ హెచ్ ఎమ్ పూర్వ విద్యార్థులు సదానందం, బాబు, రమేష్, దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

# నేటి తరానికి ఆదర్శం....ధర్మబిక్షం సేవాభావం

ఆయన స్వాతంత్ర్య సమర యోధులు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు. నిజాం వ్యతిరేక ఉద్యమ కారులు. నిబద్దత కలిగిన రాజకీయ నాయకులు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎంపీగా ప్రజా మద్దతుతో ఎన్నికై, అత్యంత సామాన్య జీవితం గడిపిన అసామాన్య నాయకులు. ఆయనే బొమ్మగాని ధర్మబిక్షం..బొమ్మగాని ధర్మబిక్షం యువకుడిగా విద్యార్థి నాయకులు, ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు. ఆర్య సమాజ్ బాధ్యులు. ప్రజా జీవితమే పరమావధిగా ఆజన్మ బ్రహ్మచారిగా గడిపిన ఆదర్శ నాయకులు. సామా జిక సేవకునిగా, గ్రామీణ పేదల హక్కుల కోసం పోరాటం, యువత, విద్యార్థులు అసంఘటిత కార్మికుల సంఘటితం, పేదలకోసం భూమి, ఇళ్ళు కొనుగోలు లాంటి కార్యక్రమా లలో అకుంఠిత కార్యదీక్ష, అంకిత భావంతో నిరంతరం అవిశ్రాంతంగా కృషి చేశారు.ఆయన నల్లగొండ జిల్లాలోని మునుగోడు మండలం, ఊకొండి గ్రామంలో బొమ్మగాని ముత్తి లింగయ్య గౌడ్, పద్మ దంపతులకు 1922 ఫిబ్రవరి 15లో జన్మించారు. బొమ్మ గాని ధర్మబిక్షం తండ్రి చిన్నవయస్సులో సూర్యాపేటకు వచ్చి స్థిరపడ్డారు. ధర్మభిక్షం సూర్యాపేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. విద్యార్థి దశలోనే జాతీయ భావాలు అలవరుచు కున్నారు. నిజాం పట్టాభిషేక రజతోత్సవాల సందర్భంగా పాఠశాలలో ఉత్స వాలు జరపాలన్న ప్రధానోపాధ్యా యుడి ఆదేశాలను వ్యతిరేకించి



తోటి విద్యార్థులతో కలిసి బహిష్క రించారు. సామాజిక రుగ్మతలపై పోరాడటం కోసం తన సహ విద్యార్థులకు శిక్షణనివ్వటానికి విరాళాలు సేకరించి ఒక వసతి గృహం ఏర్పాటు చేశారు. సోవియట్ సోషలిస్ట్ విప్లవం, భారత దేశంలో జరిగిన అనేక సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు నల్గొండ జిల్లాలో మొదటి కమ్యూనిస్ట్ సెల్‌ను స్థాపించడానికి ధర్మభిక్షంను ప్రేరేపించాయి. అలా 1942లో సీపీఐలో చేరి,కమ్యూనిస్టు పార్టీతో అనుబంధాన్ని ఏర్పరచుకుని, ధర్మభిక్షం పార్టీలో పనిచేస్తూనే పాత్రికేయులుగా తెలంగాణలోని నాటి ప్రముఖ పత్రికలైన మీజాన్, రయ్యత్, గోల్కొండల్లో పనిచేశారు. నిజాంపై సాయుధ పోరాటం మొదలైన తర్వాత తుపాకి చేత బట్టి యుద్ధరంగంలోకి దిగారు. సాయుధ పోరాటాన్ని విస్తరింప జేశారు. దేశ్‌ముఖ్ వ్యతిరేక పోరాటంలో భాగంగా పేరుమోసిన భూస్వామి విస్నూరు రామచంద్రా రెడ్డికి వ్యతిరేకంగా ధర్మభిక్షం విద్యా సంస్థల్లో నిరవధిక సమ్మెను నిర్వహించి,ఏడాదిన్నర పాటు అజ్ఞాత జీవితం గడిపారు. తర్వాత అరెస్టు కాబడి ఐదేళ్లకు పైగా జైలుశిక్షను అనుభవించారు. సూర్యా పేటలో, చంచల్ గూడ సెంట్రల్ జైలు, ఔరంగాబాద్, జాల్నా జైళ్లలో గడిపారు.స్వాతంత్ర్యం అనంతరం 1952లో తొలిసారిగా హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు సూర్యాపేట నియోజక వర్గం నుండి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆంధ్ర ప్రదేశ్ శాసనసభకు 1957లో నకిరేకల్ నుండి, 1962లో నల్గొండ నుండి ప్రాతినిధ్యం వహించారు. 1991లో, 1996లోనూ ఆయన ఎంపీగా నల్గొండ లోకసభ నియోజక వర్గం నుండి విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. 1996 లో 11వ లోక్‌సభ ఎన్నికలలో నల్లగొండ నుండి 480 మంది ఫ్లోరైడ్ బాధితులు పోటీ చేసినప్పటికి ఆయన 76 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. గీత పనివారల సంఘం ఏర్పాటు చేసి గౌడ కులస్తుల హక్కుల కోసం ఆయన చివరి వరకు పోరాడారు. తెలంగాణ ప్రాంతంలో శ్రమ జీవులను సమైక్య పర్చడంలో, పలు కార్మిక సంఘాల స్థాపనలో ధర్మబిక్షం పాత్ర మారవ లేనిది. పలు కార్మిక సంఘాల స్థాపనలో ధర్మబిక్షం ప్రధాన పాత్ర వహించి 'కార్మిక పక్షపాతి'గా గుర్తింపు తెచ్చు కున్నారు. ధర్మభిక్షం తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు, హిందీ భాషల్లో మంచి వక్తగా పేరు తెచ్చుకున్నారు. 1951-73లో భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) జిల్లా మండలి, నల్గొండ కార్యదర్శిగా, 1952-57, 1957-62, 1962-67 ఆంధ్రప్రదేశ్ శాసనసభ శాసన సభ్యులుగా, 1972 నుండి ఆంధ్రప్రదేశ్ సిపిఐ, కార్యవర్గ సభ్యులుగా, 1991లో 10వ లోక్ సభ సభ్యులుగా, 1991-96 సంప్రదింపుల కమిటీ, గ్రామీణాభివృద్ధి శాఖ సభ్యులుగా. 1992-95 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి, సిపిఐ, కార్యవర్గ సభ్యులుగా, 1996 లో 11వ లోక్ సభ సభ్యులుగా, భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ), జాతీయ మండలి సభ్యులుగా పనిచేసిన విశేష అనుభవం గడించారు. నిజాం హయాంలో రైతాంగ ఉద్యమంలో పాల్గొని, భారత ప్రభుత్వం నుంచి తామ్రపత్ర పురస్కారం అందుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ లో 2019 నవంబర్ 8న రోజున బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాన్ని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ధర్మబిక్షం నీతి, నిజాయితీకి ఆదర్శనీ యుడని ఆయన జీవిత చరిత్రను పాఠ్యాం శంలో చేర్చాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆ సందర్భం గా అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం. జీవితాంతం ప్రజా సేవకే అంకితమై, సోదరుని కుమారున్ని దత్తత తీసుకుని, అవివాహితులుగానే ఉన్నారు. 89 ఏళ్ళ వయసులో ఇంట్లో జారి పడటంతో ఆయన తుంటి ఎముకకు దెబ్బ తగలగా, హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసు పత్రిలో ఫిబ్రవరి 11న శస్త్రచికిత్స జరిపించుకొని, తర్వాత ఊపిరి తిత్తుల సమస్యతో చికిత్స పొందుతూ 2011, మార్చి 26న మరణించారు. పోరాట యోధుని గా, అసామాన్య ప్రజా సేవకునిగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని పొందారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9440595494**